

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 260 | పేజీలు - 08 | వెల - 05/- | బుధవారం 16-09-2026


మీసేవా కేంద్రాలను తనిఖీ చేసిన




# 2029 నాటికి అందరికీ సొంతిల్లు.

**2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం**


**ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన**

**కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక**

**కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

*ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.*



రాష్ట్రంలో పీఎంఏవై

మిగతా 2లో

# యూపీఐ ఛార్జీలపై రాహుల్ ఫైర్!

● రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీకి అవకాశం ఉందని రాహుల్ ఆరోపణ ● రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు ఉండవని కేంద్రం స్పష్టీకరణ ● అంతకుమించిన లావాదేవీల విషయంలో స్పష్టంగా చెప్పని కేంద్రం ● ఎండీఆర్ భారం చివరకు వినియోగదారులపైనే పడొచ్చన్న రాహుల్ గాంధీ ● జీరో-ఎండీఆర్ విధానాన్ని మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపణ



యూపీఐపై ఛార్జీల విధింపునకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరిచిందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీపై కూడా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "యూపీఐపై ఛార్జీలు విధించేందుకు మోదీ ప్రభుత్వం

మిగతాది 2లో



# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

● ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య ● కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు ● ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ ● 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ ● పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ

మిగతాది 2లో

# దేశానికి సేవ చేయండి: నిర్మల

**దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్**

**యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి**

**ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య**

**తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి**

దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం


మిగతాది 2లో



# శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న సీఎం, కుటుంబ సభ్యులు

తిరుమల, సెప్టెంబరు 15: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం సంప్రదాయ వస్త్రధారణలో సతీ సమేతంగా తిరుమలకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద మంత్రాల నడుమ అర్చకులు సీఎంకు పరివట్టం కట్టి, పట్టువస్త్రాలను తలపై ఉంచారు. అనంతరం సీఎం దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రభుత్వం తరఫున శ్రీవారికి లాంఛనంగా పట్టువస్త్రాలు సమర్పించడం తన అదృష్టమని స్వామివారి దర్శనం



మిగతాది 2లో






## మాజీ ఉప ముఖ్యమంత్రి

# కన్నుమూత!

● గుండెపోటుతో ఆళ్ల నాని మృతి ● 1969లో ఏలూరులో జన్మించిన ఆళ్ల నాని ● గత ఏడాది వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాని

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు.



# పేదలకు కేంద్రం భారీ కానుక!

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం

- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు
- ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం
- త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో

మిగతాది 2లో



# శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

ఆలయ సంప్రదాయం ప్రకారం వేద మంత్రాల నడుమ



అర్చకులు సీఎంకు పరివట్టం కట్టి, పట్టువస్త్రాలను తలపై ఉంచారు. అనంతరం సీఎం దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రభుత్వం తరపున శ్రీవారికి లాంఛనంగా పట్టువస్త్రాలు సమర్పించడం తన అదృష్టమని స్వామివారి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురవాలని, భారత్ అగ్రగామి దేశంగా తయారు కావాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా మారాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంపదలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు అపారమైన నమ్మకం ఉందని సీఎం పేర్కొన్నారు. దేశ, విదేశాల్లోని భక్తులు ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకుంటారని అన్నారు. స్వామివారి సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి





ఇబ్బందులు లేకుండా చక్కటి దర్శన భాగ్యం కల్పించాలని టీటీడీ పాలకమండలిని అధికారులకు సూచించారు. తిరుమలలో క్రమశిక్షణతో కూడిన ఆలయ నిర్వహణ దేశంలోని ఇతర ఆలయాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రీవారి ఆలయాన్ని చక్కగా నిర్వహిస్తున్న పాలకమండలి, అధికారులను అభినందించారు. ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించేలా అందరూ పనిచేయాలని కోరారు.

లిపెద్ద శేషవాహనంపై శ్రీమలయప్ప స్వామి దర్శనంలి సాలకట్ల బ్రహ్మోత్సవాల తొలిరోజు తిరుమాడ వీధుల్లో పెద్ద శేషవాహనంపై కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారిని సీఎం చంద్రబాబు దంపతులు దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనం అందించారు. సీఎం సతీమణి భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి శ్రీవారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి ఆలయంలో టీటీడీ రూపొందించిన శ్రీవారి క్యాలెండర్, డైరీ సహా వివిధ ప్రచురణలను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర సహా టీటీడీ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు..
# గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ**

ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.



**పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక**

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# యూపీఐ ఛార్జీలపై రాహుల్ ఫైర్

"యూపీఐపై ఛార్జీలు విధించేందుకు మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా తలుపులు తెరిచింది. రూ.2,000కు మించిన యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఇప్పుడు ఎండీఆర్ విధించవచ్చు" అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇలాంటి లావాదేవీలు మొత్తం యూపీఐ లావాదేవీల్లో పరిమాణం పరంగా ఐదు శాతం మాత్రమే ఉన్నా.. మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు.

**రూ.2,000 వరకు మాత్రమే ఛార్జీలు ఉండవా?**

బ్యాంకులు, పేమెంట్ వ్యవస్థల సంస్థలు రూ.2,000 వరకు యూపీఐ లావాదేవీలపై, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై ఛార్జీలు వసూలు చేయకూడదని కేంద్రం ఆదేశించింది. అయితే రూ.2,000కు మించిన లావాదేవీలపై వ్యాపారుల నుంచి ఛార్జీలు తీసుకోవచ్చా లేదా అన్న విషయాన్ని తాజా ఆదేశాల్లో స్పష్టంగా చెప్పలేదు. ఇప్పటివరకు లావాదేవీల మొత్తంతో సంబంధం లేకుండా యూపీఐపై ఎలాంటి ఛార్జీ లేదు. దీంతో కొత్త నిబంధనలపై రాజకీయ చర్చ మొదలైంది.

**చివరకు భారం వినియోగదారులపైనేనా?**

వ్యాపారులపై ఎండీఆర్ విధించినా ఆ భారాన్ని చివరకు వినియోగదారులే భరించాల్సి వస్తుందని రాహుల్‌గాంధీ అన్నారు. వ్యాపారులు ఆ అదనపు ఖర్చును వస్తువుల ధరల్లో కలిపే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమెరికా చెల్లింపు సంస్థలు చాలాకాలంగా భారత్‌లో అమల్లో ఉన్న జీరో-ఎండీఆర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని, ఇప్పుడు అదే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా కేంద్రంపై మండిపడ్డారు. ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి జేబులపై మరో భారం మోపే మార్గాన్ని వెతుకుతోందని విమర్శించారు.

**ఎందుకు ఎండీఆర్?**

యూపీఐ లావాదేవీలు భారీగా పెరగడంతో సైబర్ భద్రత, మోసాల నివారణ, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం పెద్ద మొత్తంలో ఖర్చు అవుతోందని కేంద్రం చెబుతోంది. ఈ వ్యవస్థను దీర్ఘకాలంలో స్వయం సమృద్ధిగా కొనసాగించేందుకు ఛార్జీల విధింపు అవసరమని పేర్కొంది. మరిన్ని సంస్థలు ఈ రంగంలోకి వచ్చి పోటీ పెంచాలన్నా స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని కేంద్రం తెలిపింది. సబ్సిడీలపైనే ఆధారపడటం ద్వారా యూపీఐ తదుపరి దశ వృద్ధిని కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఎండీఆర్ రేట్లను నిర్ణయించే బాధ్యతను ఎన్‌పీసీఐ ఆధ్వర్యంలోని యూపీఐ, సర్వీసెస్ స్టీరింగ్ కమిటీకి అప్పగించే అవకాశం ఉంది. దీంతో భవిష్యత్తులో రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు వస్తాయా? అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

# దేశానికి సేవ చేయండి: నిర్మల

దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

"యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు.

ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.



# మాజీ ఉప ముఖ్యమంత్రి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆళ్ల నాని వయసు 56 సంవత్సరాలు. 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు.

ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీలో ఇంటర్మీడియట్, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆళ్ల నాని, 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2013లో కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎంగా.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. గత ఎన్నికల తర్వాత వైసీపీని వీడిన ఆయన 2025 ఏప్రిల్ లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆళ్ల నాని మృతి పట్ల ఏపీకి చెందిన రాజకీయ నేతలు సంతాపం ప్రకటిస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

# నా ఆరోపణలు అబద్ధమైతే..!:
# మంత్రికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే సవాల్

(మొదటి పేజీ తరువాయి)

తనపై చేసిన వ్యాఖ్యలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. మంత్రి సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించిన ఆయన, తాను చెబుతున్నది అబద్ధమని నిరూపిస్తే రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన సవాల్ విసిరారు. నేడు హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, హైదర్ నగర్‌లోని సర్వే నంబర్లు 145, 163 భూముల విషయంలో మంత్రి వాస్తవాలను మరుగుపరిచారని విమర్శించారు. మంత్రి పేర్కొన్నట్లుగా ఆ భూములపై ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్లు నిలిచిపోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏడాది పాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ యథాతథంగా కొనసాగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై 22ఏ సెక్షన్ కింద సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కృష్ణారావు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తనకు మాట్లాడే అవకాశం కల్పిస్తే, 22ఏకు సంబంధించిన పూర్తి ఆధారాలను సభ ముందు ఉంచి తన వాదనను నిరూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, "నేను చెప్పేది అబద్ధమని తేలితే, రాజకీయ సన్యాసం తీసుకుంటాను" అని ఆయన పునరుద్ఘాటించారు.

# పేదలకు కేంద్రం భారీ కానుక

(మొదటి పేజీ తరువాయి)

5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# మావోయిస్టు నేత నక్కా సుశీల లొంగుబాటు


(మొదటి పేజీ తరువాయి)

దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా/జ్యోతి) లొంగిపోయారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (రా×దీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు. ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..
# కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు



లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలి.

**- బేడా బుడగజంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తాటికొండ బుగ్గరాముడు.**

పల్లె వెలుగు బండి ఆత్మకూరు. శ్రీశైలం నియజకవర్గం బండిఆత్మకూరు మండలం





చిన్నదేవళాపురం గ్రామం మజరా బరకల కాలనీ నందు ఏర్పాటు చేసిన 2 వినాయక విగ్రహాలకు ఒక్కో దానికి 5,000/- రూపాయల చొప్పున 10,000/- రూపాయలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, నంద్యాల 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు చందా అందజేశారు .ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ ఎంతో భక్తి శ్రద్ధలతో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చట్ట బద్ధమైన నిబంధనలతో పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మీసేవా కేంద్రాలను తనిఖీ చేసిన

**-ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ**

బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 15 : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా



వ్యవహరిస్తే మీసేవ బ్రాంచ్లను రద్దు చేస్తామని మీసేవా ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టు మేనేజర్ ఎన్ వి సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు, బండి ఆత్మకూరు లోని రెండు మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. మీసేవ కేంద్రాలలో సర్వీసులకు సంబంధించి ధరల పట్టికలు రికార్డులను మీసేవ ఫీడ్ బ్యాక్ బార్ కోడ్ ను పరిశీలించారు. మీసేవ కేంద్రాలలో సర్వీసులను ప్రజలకు వేగవంతంగా అందజేయాలని సూచించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన ప్రభుత్వ ఫీజులను నిర్ణయించిన ధరలకు మాత్రమే వసూలు చేయాలని అన్నారు. ఆదాయ కుల నివాస ధ్రువీకరణ పత్రాలు వన్ బి అడంగల్ జనన మరణ పత్రాలు, కొత్త పాన్ కార్డులు ఈ డబ్ల్యూ ఎస్, లకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఫీజులు వసూలు చేయాలన్నారు. ఫీజులు వసూలు సమయంలో ప్రజలకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని అన్నారు. సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూలు చేసి ప్రజలను దోచుకునేలా వ్యవహరిస్తే మీసేవ కేంద్రాల బ్రాంచ్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. మీసేవ కేంద్రాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణను కూడా వారు సేకరించారు. ఆయన వెంట కర్నూలు జిల్లా మేనేజర్ మహమ్మద్ రఫీ, నంద్యాల జిల్లా మేనేజర్ చెన్నయ్య, మీసేవ కేంద్రాల మండల ఉపాధ్యక్షుడు షౌకత్ అలీ రఫీ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్

బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 15: బండి ఆత్మకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మండల విద్యాశాఖ అధికారి యశోద పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయిందని పేర్కొన్నారు. ఈనెల 18న ఓటర్ల జాబితా ప్రదర్శన, చెప్పే మరి 25న ఓటరు జాబితా ఖరారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 29న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షెడ్యూల్ ప్రకారము అందరూ తల్లిదండ్రులకు తెలియజేసి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిబంధన ప్రకారం నిర్వహించి ఎన్నికైన సభ్యుల జాబితా ఈనెల 30 లోపున ప్రకటించాలని, మండల విద్యాశాఖ అధికారులు యశోద,మోహన్ రెడ్డి తెలిపారు.

## ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సుధాకర్



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ని తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) సుధాకర్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీజీఎం సుధాకర్ కుమార్ మంత్రి ఫరూక్ కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా స్థితిగతులు, విద్యుత్ శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై వారు చర్చించారు. ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించేందుకు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకా వరప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### కూటమి మోసాలను ఎండగట్టండి..

# స్థానిక పోరులో సత్తా చాటండి!

**● అరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కారు.. గెలిచాక హామీలను గాలికొదిలేశారు ● మెగా డీఎస్సీ పేరిట నిరుద్యోగులకు తీరని ద్రోహం.. నిరుద్యోగ భృతి ఏమైంది? ● అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు: అధికారులకు కాటసాని హెచ్చరిక ● కష్టకాలంలో వెన్నంటి నిలిచిన కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కొండంత అండ ● కల్లూరు అర్బన్ విస్తృత స్థాయి సమావేశంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ధ్వజం**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఎన్నికల వేళ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి, అధికార పగ్గాలు చేపట్టాక ఘోరంగా వంచించడమే కూటమి ప్రభుత్వ నైజమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్థానిక కేవీఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన కల్లూరు మండలం, కల్లూరు అర్బన్ 22 వార్డుల పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు గుర్తింపు కార్డులు అందజేసి, భవిష్యత్ రాజకీయ పోరాటాలపై దిశానిర్దేశం చేశారు.

**'సూపర్ సిక్స్' పేరుతో ఘరానా మోసం**

సమావేశంలో కాటసాని మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ద్వయంపై నిప్పులు చెరిగారు. "వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన పారదర్శక సంక్షేమ పాలన కంటే మిన్నగా చేస్తామని, సూపర్ సిక్స్ తెస్తామని ప్రగల్భాలు పలికి ఓట్లు దండుకున్నారు. తీరా గద్దెనెక్కగానే ఆ హామీలను అటకెక్కించారు. జగన్ పాలనలో కులం, మతం, ప్రాంతం చూడకుండా సంక్షేమ ఫలాలు నేరుగా పేదల ఖాతాల్లోకి చేరాయి. నేడు ప్రజలను నట్టేట ముంచారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారు. నెలకు









రూ.3,000 ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఏమైందో కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఇప్పటివరకు ఎంతమంది యువతకు భృతి చెల్లించారో దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

అధికారులూ.. రాజ్యాంగానికి లోబడి పనిచేయండి ప్రభుత్వ యంత్రాంగం అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అడ్డగోలుగా వ్యవహరించవద్దని కాటసాని హెచ్చరించారు. "పదవులు, ప్రభుత్వాలు ఎవరికీ శాశ్వతం కాదు. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో కూర్చోక తప్పదు. 2029లో ప్రజలు ఎవరికి పట్టం కడతారో కాలమే నిర్ణయిస్తుంది. కానీ అధికారులు చేసే ప్రతి పనికీ జవాబుదారీతనం ఉంటుంది. రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడి విధులు నిర్వర్తించండి తప్ప, పాలకుల స్వార్థ ప్రయోజనాలకు పావులుగా మారొద్దు" అని స్పష్టం చేశారు.

**స్థానిక సమరానికి సిద్ధం కండి**

పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలే అసలైన బలం అని కాటసాని కొనియాడారు. "ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలినా, అక్రమ కేసులు పెట్టి వేధించినా పార్టీ జెండాను గుండెలకు హత్తుకున్న కేడర్‌ను వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ విస్మరించదు. కల్లూరు పరిధిలో పార్టీ కోసం చెమటోడ్చిన నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కిందిస్థాయి కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుంది. చిన్నపాటి విభేదాలు పక్కనపెట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కదనరంగంలోకి దిగాలి. కూటమి వైఫల్యాలను, మోసపూరిత వైఖరిని ఇంటింటికీ వెళ్లి ఎండగట్టాలి. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించడమే మన అధినేత జగనన్నకు అందించే అసలైన కానుక" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్, డిప్యూటీ మేయర్, కల్లూరు మండల పార్టీ ప్రముఖులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధుల సహకారంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి.

**● స్థానిక అవసరాలు, ఆర్థిక వనరులు, అభివృద్ధి అవకాశాల ఆధారంగా విజన్ ప్లాన్ సిద్ధం చేయాలి. ● తలసరి ఆదాయం, జీడీపీ పెంపునకు రంగాల వారీగా కార్యాచరణ రూపొందించాలి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజాప్రతినిధుల సూచనలు, నియోజకవర్గ స్థానిక అవసరాలు, ఆర్థిక సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (విజన్ ప్లాన్) రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఓ ప్రకాష్, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఎల్డిఓలు, అన్ని నియోజకవర్గాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ స్థాయిలో తలసరి ఆదాయం, జీడీపీ పెంపునకు ఉన్న అవకాశాలను గుర్తించి, వ్యవసాయం, ఉద్యానవన, పరిశ్రమలు, ఎం ఎస్ ఎం ఈ లు, సేవా, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.







యూనిట్అ ధికారులకు ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఆర్థిక గణాంకాలను విశ్లేషించి, అభివృద్ధికి అత్యధికంగా దోహదపడే రంగాలను గుర్తించాలన్నారు. అధిక ఆదాయం వచ్చే ఉద్యానవన పంటలు, అంతర పంటలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎం ఎస్ ఎం ఈ లు, సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక వనరులు, ఉత్పత్తుల ఆధారంగా కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించే పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సర్క్యూట్ టూరిజం, సేవా రంగం విస్తరణకు ఉన్న అవకాశాలను గుర్తించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి విజయగాథలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. నియోజకవర్గం, మండలం, సబ్‌సెక్టార్ స్థాయిలో ఖచ్చితమైన డేటాబేస్‌ను రూపొందించి, దాని ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను నిరంతరం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెల ఎకనామిక్ రిపోర్ట్, మంత్లీ బులెటిన్ రూపొందించడంతో పాటు కె.పి.ఐ ల డేటా ఎంట్రీ, విశ్లేషణను క్రమం తప్పకుండా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పి జి ఆర్ ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, పి4 కార్యక్రమం పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, నియోజకవర్గానికి అవసరమైన కోర్ ఎజెండా, ప్రాధాన్యతా అంశాలపై దృష్టి సారించి, ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే బుడ్డా

మహానంది, పల్లె వెలుగు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెలుగోడు మండలం వేల్పనూరులో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన కొలిమి మక్తుమ్ కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల బీమా నగదును ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా గాజులపల్లెకు చెందిన ముర్తుజాబి రూ.32,000 హుస్సేన్ వలి రూ.20,795 లకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బీమా నగదు, వైద్య సహాయం కోసం నిధులు తమకు అందేలా కృషి చేసిన గాజులపల్లె తెలుగుదేశం పార్టీ నాయకులు, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



# శాంతిరాంలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు..

**71 మంది అధ్యాపకులకు ప్రోత్సాహకాలు అందజేత..**



పాణ్యం సెప్టెంబరు 15 పల్లె వెలుగు : మండలంలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం. శాంతి రాముడు మాట్లాడుతూ దేశ నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఇంజనీరింగ్ అనేది కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని, ఆవిష్కరణ, సమస్య పరిష్కారం, సామాజిక బాధ్యతతో పాటు సమాజానికి సుస్థిరమైన పరిష్కారాలను అందించే బాధ్యత కూడా అని పేర్కొన్నారు.

అనంతరం సర్ ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. దేశ ప్రగతికి విశ్వేశ్వరయ్య అందించిన అపూర్వమైన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. విద్యార్థులను సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన ఇంజనీర్లుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకుల కృషి అభినందనీయమని చైర్మన్ పేర్కొన్నారు. ఆధునిక సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర మరింత విస్తరిస్తోందని, భవిష్యత్ ఇంజనీర్లను తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. బోధన, విద్యాపరమైన పనితీరు, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, విద్యార్థులకు మార్గదర్శకత్వం, సంస్థాగత బాధ్యతల్లో విశేష సేవలు అందించిన 71 మంది అధ్యాపకులకు ప్రోత్సాహకాలను అందజేశారు. అధ్యాపకుల నిరంతర కృషికి గుర్తింపుగా అందించిన ఈ ప్రోత్సాహకాలు వారి వృత్తి జీవితంలో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రేరణగా నిలుస్తాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, హెచ్ఓడీ సౌమ్య, డీన్లు, అన్ని విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన యాజమాన్యానికి అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

- **షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**
- **భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు మండలం వెంకాయపల్లె గ్రామ పరిధిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు మంగళవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. ఆలయ ఈవో రాధాకృష్ణ, చైర్మన్ బోగిని నాగేంద్రల ఆహ్వానం మేరకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ నిధులతో నూతనంగా నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్, భక్తుల కోసం నిర్మించే టాయిలెట్ల పనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కమిటీ చేపడుతున్న చర్యలను అభినందించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. క్షేత్ర అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కర్నూలు మండల కన్వీనర్ బుర్ర వెంకటేష్ నాయుడు, సొసైటీ చైర్మన్ వెంకట్రాముడు, ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఘాట్‌లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్



బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 15: వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట ముందస్తు చర్యలు చేపడుతూ ఉంది . ఇందులో భాగంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మంగళవారం ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామాలను పర్యటించి నిమజ్జన ఘాట్‌లు, విగ్రహాల ఊరేగింపు మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెలుగోడు, ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్ల పరిధిలోని నిమజ్జన ఘాట్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఘాట్‌ల వద్ద బందోబస్తు, లైటింగ్, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ బందోబస్తు**

నిమజ్జన సమయంలో ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, అవసరమైన ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలపై కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**పోలీసులకు సహకరించాలి**

వినాయక నిమజ్జనోత్సవాల్లో పాల్గొనే భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సునీల్ షోరాణ్ కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరి సహకారంతో నిమజ్జనోత్సవాలను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మన చేతుల్లోనే మన ఆనందం

మనిషి ఆనందం కోసం బయట వెతకాల్సిన అవసరం లేదు. ఆనందంగా జీవించాలనే నిర్ణయం తీసుకుంటే మన ఆలోచనలు, చేష్టల్లోనే ఆనందం ఉంటుంది. ఆందోళనను పక్కనపెట్టి ఆశావహ దృక్పథంతో ముందుకు సాగితే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని అభివృద్ధి సాధించవచ్చు. ఒకేసారి అనేక పనులు, అపరిమిత కోరికలపై దృష్టి పెట్టడం వల్ల ఏ పనీ పూర్తిగా సాధించలేం. అందుకే ప్రాధాన్యమైన అంశాన్ని గుర్తించి, దానిపైనే ఏకాగ్రతతో శ్రద్ధ పెట్టాలి. చిన్న చిన్న విజయాలను మనస్ఫూర్తిగా ఆస్వాదించడం సంతృప్తిని పెంచడంతో పాటు కొత్త సంకల్పాలకు బీజం వేస్తుంది. మనకు ఆసక్తి ఉన్న అంశాన్ని ఎంచుకుని పట్టుదలతో కృషి చేయాలి. సాకులు వెతకకుండా, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఓపికగా ముందుకు సాగుతూ పనిని ప్రేమిస్తే నైపుణ్యం, ఉత్పాదకత పెరుగుతాయి. ఆనందం మన అంతర్గత ఆలోచనా విధానం, మానసిక స్థితిపైనే ఆధారపడి ఉంటుంది. -- నేదునూరి కనకయ్య, అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక, తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం, కరీంనగర్

---

# మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

**-45 పాఠశాలలు,రెండు జూనియర్ కళాశాలల్లో ఎన్నికలు..**




పాణ్యం సెప్టెంబర్ 15 పల్లె వెలుగు : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష పరిధిలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ ) ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 15న మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. పాణ్యం మండల పరిధిలోని 45 పాఠశాలలు,రెండు జూనియర్ కళాశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఆర్. కోటయ్య,ఎం. సుబ్రమణ్యం తెలిపారు. సెప్టెంబర్ 18న మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తారు. సెప్టెంబర్ 25న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, తుది జాబితాను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 1:30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు, 2 గంటలకు ప్రమాణ స్వీకారం, 3 గంటల నుంచి 3:30 గంటల వరకు తొలి ఎస్ఎంసీ సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# కాంట్రాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి తండ్రి భౌతికకాయానికి మంత్రి ఎన్ఎండి ఫరూక్ నివాళులు.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, ఎమ్.ఆర్. రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత రవీంద్రనాథ్ రెడ్డి గారి పితృవియోగం పట్ల రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రవీంద్రనాథ్ రెడ్డి తండ్రి మరణించారన్న వార్త తెలుసుకున్న మంత్రి ఫరూక్ వెంటనే స్పందించి నంద్యాల ఎన్జీవోస్ కాలనీలోని వారి నివాసానికి చేరుకుని, ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవీంద్రనాథ్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను మంత్రి ఫరూక్ పరామర్శించి ఓదార్చారు.

# లారీ క్యాబిన్‌లో వివాహిత అనుమానాస్పద మృతి

- **భర్త తీసుకెళ్లిన మూడు రోజులకే శవమై తేలిన వైనం**
- **చిన్నటేకూరు వద్ద లారీలో మృతదేహం లభ్యం**
- **అన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ లక్ష్మీదేవి (భర్త బి.ఎం. మల్లికార్జున) లారీ క్యాబిన్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఈ నెల 11వ తేదీ (శుక్రవారం) రాత్రి దాదాపు 11:30 గంటల సమయంలో భర్త మల్లికార్జున తన భార్య లక్ష్మీదేవిని స్వగ్రామం వెంకటగిరి నుంచి వెంట తీసుకెళ్లాడు. అనంతరం 14వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మల్లికార్జున లక్ష్మీదేవి బంధువులకు ఫోన్ చేసి, మీ కూతురు లారీలో చనిపోయిందని సమాచారం అందించాడు.

ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చిన్నటేకూరు గ్రామ హైస్కూల్ ఎదురుగా నిలిపి ఉంచిన లారీ వద్దకు వెళ్లి చూడగా, లారీ క్యాబిన్‌లో లక్ష్మీదేవి విగతజీవిగా పడి ఉంది. ఈ ఘటనపై మృతురాలి అన్న బోయ రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మృతికి గల పూర్తి కారణాలు విచారణ అనంతరం తెలియాల్సి ఉంది.

# స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ..



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక. గడివేముల మండలంలోని అన్ని పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 18వ తారీఖున ఓటర్ల లిస్టు నోటీసు బోర్డులో పెడతామని ఎంఈఓ పి సుబ్బారామిరెడ్డి తెలియజేశారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సభ్యుల ప్రకారం అందరు తల్లిదండ్రులకు తెలియజేసి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల్లో నిబంధన ప్రకారం నిర్వహించాలి 29న ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1.30కు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, రెండు గంటలకు ప్రమాణస్వీకారం. మొదటి సమావేశాలు నిర్వహిస్తామన్నారు, 50% మహిళలు తప్పనిసరి అన్నారు. రెండేళ్లు పదవీకాలం ఉంటుందని తెలియజేశారు.

## అంగన్వాడి టీచర్ లక్ష్మీనారాయణమ్మను అభినందించిన పీడీ



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను ప్రాజెక్టు డైరెక్టర్ లీలావతి మంగళవారం పరిశీలించారు. బాలింతలకు, గర్భిణీలకు ఇస్తున్న పౌష్టిక ఆహారం, చిన్నారులు ఎంత మంది వస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే ఎస్సీ కాలనీలోని అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్ర పరిసరాలు,పిల్లల యాక్టివిటీస్, హాజరు శాతం బాగుందని టీచర్ లక్ష్మీనారాయణమ్మను అభినందించారు. మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అభ్యాసన, సామర్థ్యాలు పెంచాలన్నారు.

## మహానంది మండలంలో
## పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ...గ్రామాల్లో ఈనెల 18న ఓటర్ల జాబితా విడుదల, 25న అభ్యంతరాలు స్వీకరణ, అదే రోజు తుది ఓటర్ల జాబితా విడుదల ఉంటుందని పేర్కొన్నారు. 29 మంగళవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలతో పాటు ఎస్ఎంసి మీటింగ్ ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 100 లోపు మంది విద్యార్థులు ఉంటే 12 నుండి 15 మంది, 100 నుండి 500 మంది విద్యార్థులు ఉంటే 15 నుండి 20 మంది 500 నుండి ఆ పైన ఉంటే 20 నుండి 25 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. 75 శాతం ఆ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఉంటారని, మిగతా 25 శాతం గ్రామ లేదా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డు సభ్యులు ఏఎన్ఎం , ఏ డబ్ల్యు డబ్ల్యు, ఆశ, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు సభ్యులుగా ఉంటారన్నారు. 50శాతం మహిళలు తప్పనిసరిగా సభ్యులుగా ఉండాలని నియమం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, సి డబ్ల్యూ ఎస్ ఎన్ రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్ ల పదవి కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు.

## పార్టీ నాయకుల ప్రతినిధులతో సమావేశం



దొర్నిపాడు సెప్టెంబర్ 15 పల్లె వెలుగున్యూస్ మండలంలో ని 11 గ్రామ పంచాయతీలలోని 07 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ అన్ని గ్రామ పంచాయతీలలో పబ్లిష్ చేయడం జరిగినది అని ఎంపీడీవో సావిత్రి తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించితాసిల్దార్ ఆఫీస్ నందుడ మండల పరిషత్ కార్యాలయంలో డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం జరిగినది.వీజ్ా పోలింగ్ స్టేషన్ పై ఏమైనా అభ్యంత రాలు, సూచనలు సలహాల కొరకు అన్ని పార్టీలతో బుధవారంఉదయం 10.00 గంటలకు ఎజూుశీ ఆఫీస్ నందు సమావేశంఏర్పాటుచేయడమయినది. కనుక ప్రతి రాజకీయ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు

### తక్కువ నీటి వినియోగం గల పంటలు సాగు చూసుకోవాలి....
## వ్యవసాయ అధికారి సుమతి.

రుద్రవరం. పల్లె వెలుగు : తక్కువ నీటి వినియోగం గల పంటలను రైతులు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామం లో వ్యవసాయ అధికారి జి సుమతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు సరైన సమయానికి పడనందువలన బోరు బావులు ఉన్న రైతులు తక్కువ నీటి వినియోగం గల పంటలైన మినుము,పెసర, నువ్వులు కొర్ర ఆముదం వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు మొక్కజొన్న పైరుకు నీటి తడులు ఎక్కువ అవసరం ఉన్నందువలన దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వినియోగం గల పంటలను సాగు చేసుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు తెలియజేశారు. రాబోయే రోజులలో మినుములు 80% సబ్సిడీలో రైతులకు అందజేయడం జరుగుతుందని కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని రైతులను కోరారు. డ్రిప్ మరియు స్ప్రింక్లర్ పరికరాలు కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బంది సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రవితేజ గ్రామ రైతులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటి స్థలం, టిడ్కో ఇల్లు అందేలా చర్యలు.

**ఆన్‌లైన్‌లో వచ్చిన ఇంటి పట్టాల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి: మంత్రి ఎన్ఎండీ ఫరూక్.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటి స్థలం, టిడ్కో ఇళ్ల కేటాయింపు జరిగేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాలలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌లతో కలిసి నంద్యాల నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్ల కేటాయింపులపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలో టిడ్కో ఇళ్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్, ఖాళీగా ఉన్న ఇళ్ల వివరాలు తదితర అంశాలపై అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో ఇళ్లను గరిష్ట స్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న ఇళ్లను ఖాళీగా ఉంచకుండా అర్హత కలిగిన లబ్ధిదారులకు పారదర్శకంగా కేటాయించాలని సూచించారు.

నంద్యాల నియోజకవర్గంలో ఇంటి పట్టాల కోసం ఆన్‌లైన్‌లో దాదాపు 7,000 మంది దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన



ఇంటి పట్టాలు మంజూరు చేసే విధంగా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, నిబంధనల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్ల కేటాయింపునకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రయోజనం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల అర్హత నిర్ధారణ, తదుపరి కేటాయింపు ప్రక్రియను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ ఈఈ, టిడ్కో ఈఈ, నంద్యాల మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ, నంద్యాల, నంద్యాల రూరల్, గోస్పాడు తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# వలస విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లు వరం

హోళగుంద పల్లె వెలుగు సెప్టెంబర్ : 15 వలస వెళ్లే కుటుంబాల విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా సీజనల్ హాస్టళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని మండల విద్యాధికారి పి. కబీర్ సాబ్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసులు, తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి చిన్నహేట శేషగిరి, ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సి హెచ్. నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన హోలగుందలో జిల్లా సమగ్ర శిక్ష సౌజన్యంతో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ, అంబేద్కర్ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో వలస విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన రెండు సీజనల్ హాస్టళ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు వల్ల వలస కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువును మధ్యలో నిలిపివేయకుండా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల హాజరు శాతం కూడా పెరుగుతుందని తెలిపారు. వలస వెళ్లే విద్యార్థులందరూ సీజనల్ హాస్టళ్లలో చేరి చదువుకు ఆటంకం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందని



సూచించారు. విద్యార్థుల విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు నిధులు కేటాయిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వలస కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ హెచ్. చలపతి, చిన్నహేట ప్రధానోపాధ్యాయులు ఏకే మారెప్ప, పాండురంగరాజు, హోలగుంద ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నప్పరెడ్డి, సీఆర్‌పీలు లక్ష్మప్ప, తుకారాం, రేణుక, సీజనల్ హాస్టల్ సిబ్బంది జమాదాగ్ని, సోహెబ్, విజయలక్ష్మి, ఎంఈవో కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లు సాయి బేస్, పంపాపతి, గ్రామస్తులు తోటప్ప, హనుమంతు, మల్లికార్జున, విద్యార్థులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ ఏ ఆర్ ఎస్ నుంచి కలెక్టరేట్ తరలింపు, నూనెపల్లె మార్కెట్ యార్డులో టీడీపీ కార్యాలయానికి
# భూకేటాయింపు రద్దుకు అఖిలపక్షం డిమాండ్.

**నంద్యాల నడిగడ్డలో పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజలు, రైతులు, యువత మద్దతు.**




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల స్థలాన్ని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి కేటాయించడాన్ని రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష ఐక్యవేదిక చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి నంద్యాల నడిగడ్డ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ నిర్ణయాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరుతూ మంగళవారం నంద్యాల నడిగడ్డలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రజలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, దాదాపు 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ ఏ ఆర్ ఎస్ నంద్యాల ప్రాంత వ్యవసాయ పరిశోధనకు కీలకమైన సంస్థ అని అన్నారు. రైతుల ప్రయోజనాలు, వ్యవసాయ పరిశోధన, నూతన సాంకేతికతల అభివృద్ధికి ఉపయోగపడాల్సిన ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణంలో తాత్కాలిక కలెక్టరేట్ కొనసాగించడం వల్ల పరిశోధనా కార్యకలాపాలకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

"ఆర్ ఏ ఆర్ ఎస్ ను పరిరక్షించాలని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక కలెక్టరేట్‌ను అక్కడి నుంచి వెంటనే తరలించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, రైతులు మరియు వ్యవసాయ మార్కెట్ అవసరాల కోసం ఉద్దేశించిన నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిలో రెండు ఎకరాలను రాజకీయ పార్టీ కార్యాలయానికి కేటాయించడాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించి, ఆ కేటాయింపును వెంటనే రద్దు చేయాలని ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డు భూములను రైతులు, వ్యాపారులు, ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్ ఏ ఆర్ ఎస్ పరిరక్షణ, నూనెపల్లె మార్కెట్ యార్డు భూముల రక్షణ కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని అఖిలపక్ష ఐక్యవేదిక స్పష్టం చేసింది. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన ఈ రెండు నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు ప్రజా ఒత్తిడిని కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, కో–కన్వీనర్లు బాబా ఫక్రుద్దీన్, సోమన్న, చౌడప్ప, మజీద్ ఖాన్, జానయ్య, పట్నం రాముడు, షణ్ముఖ, సుధాకర్ రావు, ప్రొఫెసర్ శివరామిరెడ్డి, మోహన్ బాబు, రవికుమార్, ఏసురాజు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ ఇంజనీర్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ ఇంజనీర్స్ దినోత్సవం.



రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన ఇంజనీర్లు

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మంగళవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని నిర్వహించే జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నంద్యాలలో స్థానిక రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా విభాగం, పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్ల జిల్లా సంఘం, సచివాలయ ఇంజనీర్ల జిల్లా సంఘం సంయుక్త నిర్వహణలో ఘనంగా నిర్వహించారు.

***ఈ సందర్భంగా నంద్యాల విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురామిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. 30 మంది ఇంజనీర్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.***

తదుపరి రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. రఘురామిరెడ్డి అధ్యక్షతన, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వి. సుధాకర్ రెడ్డి, డిప్లమా ఇంజనీర్స్ సంఘం అధ్యక్షుడు శివ శంకర్, సచివాలయ ఇంజనీర్స్ సంఘం అధ్యక్షుడు సంతోష్ రెడ్డి నిర్వహణలో జరిగిన జాతీయ ఇంజనీర్ల దినోత్సవం లో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ అతిథులుగా పాల్గొన్నారు.

ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఇంజనీర్ల దినోత్సవాన్ని ప్రారంభించారు.

ఇంజనీర్ల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్, షటిల్, చెస్ , క్యారమ్స్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన అసిస్టెంట్ ఇంజనీర్లు ఏడు మంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో, మండలానికి ఒకరు చొప్పున 29 మందికి ఉత్తమ సేవ పురస్కారాలు అందజేశారు.

నంద్యాల లయన్స్ క్లబ్ తరపున లయన్స్ సీనియర్ సభ్యులు, ఇంజనీర్లు సుధాకర్ రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి ల సహకారంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురామిరెడ్డి, విశ్రాంత ఇంజనీర్లు మురహరి రావు, పి. రాముడు లకు లయన్స్ క్లబ్ జాతీయ ఇంజనీర్ల దినోత్సవం పురస్కారాలు అందించి సన్మానించారు.

ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవజీవన్ బదిరుల పాఠశాల కు క్రీడా పరికరాల కొనుగోలుకు 12 వేల రూపాయలు విరాళాలు అందించారు.

**ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాం రెడ్డి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలను గుర్తుచేసి, వారి స్ఫూర్తితో యువ ఇంజనీర్లు జాతి నిర్మాణంలో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.**

డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి రంగంలో ఇంజనీర్ల పాత్ర ప్రముఖంగా ఉంటుందన్నారు. సాంకేతికతను పెంపొందించుకుని ప్రజలకు సేవలు అందించాలని కోరారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ మానవజాతి అభివృద్ధి ప్రతి దశలో ఇంజనీర్ల పాత్ర ఉందని, వైద్యరంగం, వ్యవసాయ రంగం, జాతీయ రక్షణ రంగం ఇలా ప్రతి రంగంలో ఇంజనీర్లు సాధించిన ప్రగతి, పరిశోధనలే ప్రపంచ అభివృద్ధికి కీలకంగా ఉన్నాయని ఇంజనీర్ల సేవలను కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఇంజనీర్ల సేవలను ప్రశంసించి వారి కి అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నెరవేర్చాలని అన్నారు.

రామకృష్ణ పీజీ కళాశాల డైరెక్టర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ యువ ఇంజనీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడం ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు.



***కార్యక్రమాల్లో అతిథులుగా పాల్గొని ఇంజనీర్ల సేవలను కొనియాడిన డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ సహదేవుడు, రామకృష్ణ విద్యా సంస్థలు డైరెక్టర్ హేమంత్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ లను మూడు ఇంజనీర్ సంఘాల తరపున సత్కరించారు.***


కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి సచివాలయ ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సలహాదారు వంశీధర్, కోశాధికారి కరీముల్లా, పంచాయతీరాజ్ డిఇ లు వహీద్, మన్మధ బాబు, అయాజ్ అహ్మద్, మల్లికార్జున, లక్ష్మీదేవి, నళిని, సుధాకర్ బాబు, రమణ, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాసులు, సుధీర్ కుమార్ రెడ్డి, వెంకటరాముడు, కమాల్ సాహెబ్, వెంకటరమణ, చెంచయ్య, జయన్న, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ సహదేవుడు,లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ కుమార్, రీజియన్ చైర్మన్ నిజాముద్దీన్, జోనల్ చైర్మన్ నాగరాజు, రవి ప్రకాష్ యూసుఫ్, జనార్ధన్ , జిల్లా నలుమూలల నుండి వచ్చిన సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**● పాత్రికేయ గణనాథుడికి ఘనంగా రెండో రోజు పూజలు ● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జేసీ నూరుల్ ఖమర్ ● కలెక్టర్ చేతుల మీదుగా ప్రసాద వితరణ.. విశేషంగా ఆకట్టుకున్న అన్నదాన కార్యక్రమం ● భక్తితో పాటు సేవాభావం వెల్లివిరియాలి: 'కందనవోలు' వ్యవస్థాపకులు కురువ శ్రీనివాసులు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలోని సమాచార పౌర సంబంధాల శాఖ ఆవరణలో కొలువైన 'పాత్రికేయ గణపతి' రెండో రోజు వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా జరిగాయి. పాత్రికేయ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేద పండితులు వ్యాపారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి



శాస్త్రోక్తంగా విశేష పూజలు, మహామంగళహారతులు నిర్వహించారు.

ఈ పూజా మహోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది.

పర్యావరణ స్పృహతో పూజలు: కురువ శ్రీనివాసులు

ఉత్సవాల్లో భాగంగా 'కందనవోలు' దినపత్రిక వ్యవస్థాపకులు కురువ శ్రీనివాసులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం భక్తుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి ప్రపత్తులతో పాటు సేవాభావాన్ని పెంపొందించే వేదికలు కావాలని ఆకాంక్షించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, ఆ విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. స్వామివారి సన్నిధిలో అన్నప్రసాదం అందించడం ఎంతో పుణ్యప్రదమని, సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు.

తరలివచ్చిన మీడియా ప్రతినిధులు, భక్తులు

ఈ వేడుకల్లో సమాచార శాఖ అధికారిణి కె.జయమ్మ, హరినాథ్ రెడ్డి, రామకృష్ణలతో పాటు పాత్రికేయ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు మంజునాథ్ యాదవ్, పల్లె వెలుగు బ్యూరో నాగేంద్రుడు, శ్రీనాథ్ రెడ్డి, అవినాష్, సాగర్, రాఘవేంద్ర గౌడ్, పరశురాం, వి.విజయ్ కుమార్ యాదవ్, గిలిగిత్త విజయ్ కుమార్, కిషోర్ కుమార్ రెడ్డి, ప్రకాష్, పుల్లం రాజు, గంగాధర్, అంజి, రమేష్, చెన్నయ్య, నరసింహ తదితర పాత్రికేయులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి.

రుద్రవరం. పల్లె వెలుగు : మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల లో ఏర్పాటుచేసిన ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మంగళవారం అధికారికంగా ప్రచురించినట్లు ఎంపీడీవో తెలిపారు.




ప్రచురించిన ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల ముసాయిదా జాబితా పై ఓటర్లకు గాని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏవైనా అభ్యంతరాలు సవరణలు లేదా క్లైములు ఉన్నట్లయితే వాటిని బుధవారం (16-09-2026 తేదీ) సాయంత్రం 5 గంటల లోపు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించవచ్చునని తెలిపారు. ఈ ముసాయిదా జాబితాను మండల పరిషత్ కార్యాలయము అలాగే సంబంధిత గ్రామ సచివాలయాలలో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచడం జరిగిందని, ఓటర్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు ముసాయిదా జాబితాను గమనించి నిర్దేశిత గడువులోగా క్లైములను తెలియజేయాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, ఏవో సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

# తహశిల్దార్ కు సమ్మె నోటీసు అందజేసిన విలేజ్ సర్వేయర్లు.

రుద్రవరం. పల్లె వెలుగు : దీర్ఘకాలిక తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్



చేస్తూ నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గ్రామ సర్వేయర్లు,ఎస్ జి ఎస్ డబ్ల్యు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మంగళవారం వారు రుద్రవరం తహశీల్దార్ నాగవీణకు సమ్మె నోటీసుతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలకు మద్దతుగా, తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ ఆందోళన బాట పడుతున్నట్లు వారు స్పష్టం చేశారు. ప్రతి ఎస్ జి ఎస్ డబ్ల్యు ఉద్యోగికి కనీస మూలవేతనం రూ. 30 వేలు నిర్ధారించాలని, మల్టీ బాసిజం విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రీ-సర్వే, టీఏ/డీఏ బిల్లులను తక్షణమే చెల్లించాలని, అలాగే ప్రతి సర్వేయర్‌కు ల్యాప్‌టాప్ కేటాయించాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు.

రైతులకు న్యాయం జరగాలన్నా, నాణ్యమైన భూ రికార్డులు అందించాలన్నా ముందుగా తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం మండలానికి చెందిన డి. భవిత, ఎ. ఇలియాస్, నిజాముద్దీన్, సుధాంశు, సుప్రియ తదితర విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# బేతంచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి సెప్టెంబర్ 15 :- సెప్టెంబర్ 18న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాజయప్రదం చేయండి ప్రభుత్వం వెంటనే బేతంచెర్ల మండలమును కరువు మండలంగా ప్రకటించి పంటల బీమా వర్తింపజేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి పి రామమోహన్ ఆధ్వర్యంలో ఆటో జాతర కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో మండలంలో రైతుల వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి ఉన్న పంటలు ఇప్పుడు వర్షం పడిన దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు అందువలన ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు రైతులందరూ సెప్టెంబర్ నెల 18వ తేదీన బేతంచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయము ముందు జరిగే ధర్నాకు వేసిన పంటల నష్టాన్ని తెలియజేస్తూ, వ్యక్తిగత అర్జీలు తీసుకొని రావాలని పిలుపునిచ్చారు.

అలాగే సెప్టెంబరు నెల 21వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము దగ్గర జరిగే "నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి" అనే ధర్నాలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బేతంచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలి.




రైతు, కౌలు రైతుల అన్ని రకాల అప్పులను మాఫీ చేయాలి, పంటల బీమా వర్తింపజేయాలి. దేవాదాయ భూములు కౌలుకు సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ ఒక సంవత్సరం కౌలును రద్దు చేయాలి.

మూగ జీవాలకు మేత కొరత లేకుండా ప్రభుత్వమే గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేసి, మేతను ఉచితంగా రైతులకు అందించాలి. బేతంచెర్ల మండలంలో ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు లేదు. గూటుపల్లె చెరువును, హంద్రీ నీవా, సుజల స్రవంతి నీటి కాలువ నుండి, గూటుపల్లె చెరువును నీటితో నింపాలి.

బేతంచెర్ల మండలంలోని, గూటుపల్లె చెరువును రిజర్వాయర్ గా నిర్మించాలి.రైతులందరికీ పంటల బీమా ఉచితంగా వర్తింపజేసి, బీమా పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలి.

గ్రామాలలోని పేదలకు వరి, రాగి, జొన్న, కరువు రూపీలను పంపిణీ చేసి ఉచితంగా బియ్యం, నిత్యావసరాల సరుకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలి.

50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతు, మహిళా రైతుకు నెలకు 10 వేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలి.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వడ్డే మధు అంబాపురం గ్రామ రైతులు పి. శివ గంగన్న, దుబ్బమడుగు మద్దిలేటి,గుమ్మా మదిలేటి,రామ్మోహన్ రెడ్డి,ఎల్ల కేశవులు, అనిల్, మాదన్న గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయనిధి



మహానంది, పల్లె వెలుగు పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పనూరులో బుక్కాపురం గ్రామానికి చెందిన ఆవులపాటి వేణుగోపాల్ కుటుంబానికి సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుండి సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు, శ్రీశైలం నియోజకవర్గం మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్, మండల జనసేన నాయకులు మారెడ్డి రామయ్యకు లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి.





రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలంలో వినాయక నిమజ్జన వేడుకలను మతసామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రాము, ఎస్ఐ జయప్ప సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో తహశీల్దార్ నాగవేణి, విద్యుత్ ఏఈ రాజశేఖర్ తో కలిసి నిర్వహించిన పీస్ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ దేవుడి దగ్గర అందరూ సమానమేనని, ఎలాంటి పట్టింపులకు పోకుండా కలిసికట్టుగా వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకే ఊరేగింపు ప్రారంభించి సాయంత్రం 6 గంటల లోపు ముగించాలని, డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. పోలీసులు అనుమతించిన రూట్లలోనే ఊరేగింపు జరగాలని, రసాయనాలు లేని సహజ రంగులనే వాడాలని, డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. భద్రతా దృష్ట్యా నిమజ్జనం వద్దకు చిన్నపిల్లలను తీసుకురావొద్దని, చెరువులు, కాలువలలోకి ఎవరూ లోపలికి దిగకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని అధికారులు సూచించారు.

## విశ్వేశ్వరయ్య సేవలు ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకం

-ఆదోని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు.

ఆదోని (పల్లె వెలుగు): భారతరత్న, ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య



జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను ఆదోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇంజనీర్స్ డే సందర్భంగా కేక్



కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో సేవలందిస్తున్న డీఈ రామమూర్తి, డీఈ రాజశేఖర్ రెడ్డి, ఏఈ భువన చంద్రారెడ్డి, ఏఈ పావని, ఏఈ సురేష్ చంద్రలను కమిషనర్ అభినందించారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన సేవలు అందించడంలో ఇంజనీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. హ్యూమానిటీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది సావిత్రి, కృష్ణ, భద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, పబ్లిక్ హెల్త్ అండ్ శానిటేషన్ విభాగాల సిబ్బందితో పాటు మేనేజర్లు, సూపర్వైజర్లు, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని మండలం రెండు మండలాలుగా విభజన

**పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా ప్రచురణ**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలాన్ని ఆదోని మండలం-1, ఆదోని మండలం-2గా విభజిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 120ను సెప్టెంబర్ 15, 2026న జారీ చేసింది. ఈ మేరకు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) సాధారణ ఎన్నికలు-2026కు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను అధికారులు ప్రచురించారు. ఆదోని-1 మండల ప్రజా పరిషత్ పరిధిలో 14 ఎంపీటీసీ నియోజకవర్గాలు, ఆదోని-2 మండల ప్రజా పరిషత్ పరిధిలో 17 ఎంపీటీసీ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ఆదోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీవో తెలిపారు. రాజకీయ పార్టీలతో రేపు సమావేశం పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సెప్టెంబర్ 16న ఉదయం 11 గంటలకు ఆదోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆదోని-1, ఆదోని-2 మండలాల పరిధిలో జరగనున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల సాధారణ ఎన్నికలు-2026కు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని అధికారులు కోరారు.

# రామిరెడ్డిపల్లెలో ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు ఆపాలి.

**జనావాసాల మధ్య భారీ టిప్పర్లతో మట్టి తరలిస్తున్నా అధికారులు ఎందుకు మౌనం.**



(పల్లె వెలుగు న్యూస్) రిపోర్టర్ మహేష్ :- సంజామల మండలం రామిరెడ్డిపల్లెలో మంచాల మద్దిలేటిరెడ్డి ,ఇష్టానుసారంగా మట్టిని తవ్వి, భారీ టిప్పర్ల ద్వారా జనావాసాల మధ్య నుంచి తరలిస్తున్నారని సంజామల రైతు సంఘం మండల కన్వీనర్ అబ్రహం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలు నివసించే ప్రాంతాల మధ్య పెద్ద పెద్ద టిప్పర్లతో మట్టిని తరలించడం వల్ల దుమ్ము, కాలుష్యం, రోడ్లపై ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని, ప్రజల భద్రతను పట్టించుకోకుండా ఈ వ్యవహారం కొనసాగించడం దారుణమని అన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఎమ్మార్వో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు,వ్యవహరిస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోందని అబ్రహం విమర్శించారు. మట్టి తరలింపునకు,అనుమతులు ఉన్నాయా, ఎంత పరిమాణంలో మట్టి తరలిస్తున్నారు,ఏ ప్రాంతం నుంచి మట్టి తీస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు, అనే అంశాలపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి ఇబ్బంది కలిగించే విధంగా మట్టి తరలింపు జరుగుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర పోషించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, తరలింపులు,జరుగుతున్నట్లయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అబ్రహం హెచ్చరించారు.

## మత్తు పదార్థాల మాయలో పడొద్దు.. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు!

**-డ్రగ్స్, గంజాయికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలి ఎస్ఎఫ్ఐ.**

**ఈ నెల 17న అన్నదానం**





ఆదోని (పల్లె వెలుగు): విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో శ్రీ విఘ్నరాజ యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ విఘ్నరాజ యువజన సంఘం సభ్యులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రజాశక్తి రిపోర్టర్ మునప్పలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత చైతన్యవంతులు కావాలని, సమాజంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో శ్రీ విఘ్నరాజ యువజన సంఘం గత మూడు సంవత్సరాలుగా వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తూ యువతలో ఐక్యత, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. శ్రీ విఘ్నరాజ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ సాయంత్రం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ విఘ్నరాజ యువజన సంఘం సభ్యులు నరసింహులు, వీరేష్, నాగరాజు, పవన్, రవితో పాటు యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి
- గ్రామస్తాయి నుంచి ప్రజా సమస్యలపై పోరాటం మాజీ


ఆళ్లగడ్డ సెప్టెంబర్ 15, పల్లె వెలుగు రాబోయే స్థానిక సంతల ఎన్నికలకు ప్రతి నాయకుడు, కార్యకర్తలు సిద్ధం కావాలని, గ్రామస్తాయి నుండి పార్టీని బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం కలిసి పోరాటం చేద్దామని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రా రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి మాట్లాడుతూ నా ఎన్నికలకు మీరు ఏ విధంగా కష్టపడి అండగా నిలబడ్డారో అదే విధంగా నేను మీ ఎన్నికలకు అండగా నిలబడుతానని ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్తకు భరోసా యిస్తున్నానన్నారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి నాయకుడు, కార్యకర్త ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. అలాగే గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతానికి ప్రతోడు ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై




అందరం కలిసి నిరంతరం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి , విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్పీ జగన్ మోహన్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి వైసిపి మైనార్టీ నాయకులు షేక్ బాబూలాల్ సిరివెళ్ల సలాం, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి ,మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి సింగం వెంకటేశ్వర్ రెడ్డి మాదం చెన్నయ్య ఆరు మండలాల వైకాపా నాయకులు పార్టీ కార్యకర్తలు, గంగుల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దిగువ అహోబిలంలో ఘనంగా స్వాతి సుదర్శన హోమం

**స్వాతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి**





ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 15 పల్లె వెలుగుఆళ్లగడ్డ మండలంలోని సుప్రసిద్ధ ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో మంగళవారం లక్ష్మీ నరసింహ స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులు ప్రహ్లాద వరద స్వామి , శ్రీదేవి, భూదేవి, మూర్తులకు జ్యేష్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, కిడాంబి వేణు గోపాలన్ స్వామి ఆధ్వర్యంలో సుదర్శన హోమం, పూర్ణాహుతి, కార్యక్రమం నిర్వహించారు. స్వాతి వేడుకలను సీఈవో మాధవన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, వైసిపి నాయకులు కొంకర కృష్ణారెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని స్వాతి వేడుకల్లో పాల్గొన్నారు

# నంద్యాల "టూ " ఓడరేవుకు.

-తరలిపోతున్న పిడిఎస్ బియ్యం.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

నంద్యాల జిల్లా కేంద్రం నుండి ఓడరేవుకు నిత్యవసర వస్తువుల బియ్యం భారీగా తరలిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన నంద్యాల నుండి ప్రతినెల 100ల క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం ఓడరేవుకు తరలిపోతున్నట్లు జిల్లా పరిశీలకులు అంచనాలు వేసుకుంటున్నారు . కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎక్కడ కూడా అవకతవకలు జరగకుండా పిడిఎస్ బియ్యాన్ని పేదలకు అందజేస్తూ ఉంది. నిత్యావసరాల బియ్యంతో కడుపు నింపుకుంటున్న పేదలకు అధిక సొమ్ము ఆశగా చూపి వారి వద్ద నుండి దళారులు పిడిఎస్ బియ్యం సేకరించి నంద్యాల జిల్లా నుండి పట్టపగలే ఆటోలలో దళారులు తమస్తావరాలకు తరలించుకొని పోతున్నారు. వివరాల్లోకి వెళ్ళితే నంద్యాల పట్టణంలోని స్థానిక జగజ్జనని ఏరియాలో కొంతమంది దళారులు మధ్యవర్తులతో నిత్యవసర వస్తువుల బియ్యాన్ని సేకరించి పట్టపగలే ఏపీ 39 యు ఎక్స్ 5349 నెంబర్ గల ఆటోలో తరలిస్తున్నారు . పిడిఎస్ బియ్యాన్ని దళారులు సేకరించి ఓడరేవుకు తరలిస్తున్న విషయములో అధికారుల హస్తం కూడా ఉందా ? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అధికారులకు మామూలు ముట్ట చెబుతు, పిడిఎస్ బియ్యాన్ని నూనెపల్లె లోని మధు అనే వ్యాపారి ఆధ్వర్యంలో పిడిఎస్ బియ్యం సేకరించి పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు, ఓ ఆటో నిర్వాహకుడు






తెలిపారు. పిడిఎస్ బియ్యం సేకరిస్తున్న దళారుల వెనుక ఒక సామాజిక వర్గానికి చెందిన బడా బాబు వ్యక్తి ఉన్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పిడిఎస్ బియ్యంపై కట్టుదిష్టమైనక, కఠినమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, దళారులు రెవెన్యూ మరియు పోలీసుల కళ్ళు కప్పి పిడిఎస్ బియ్యాన్ని ఓడరేవుకు తరలిస్తున్నట్లు సమాచారం. జిల్లా అధికారులు స్పందించి నంద్యాల జిల్లాలో ప్రతినెల భారీగా పిడిఎస్ బియ్యం సేకరిస్తున్న నూనెపల్లెకు చెందిన మదు అనే వ్యాపారిని ఆధీనంలోనికి తీసుకొని, పిడిఎస్ బియ్యం స్టాక్ నిల్వ ఉంచిన స్థావరాలపై పోలీస్, రెవెన్యూ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి, నంద్యాల పట్టణంలోని జగజ్జనని నగర్ ఏరియాలో పిడిఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను, బియ్యం సేకరిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని నూనెపల్లెకు చెందిన మధు తో పాటు దళారుల వెనుక ఉన్న సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ని కూడా అదుపులో తీసుకొని వారిపై చట్టపరమైన, కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

## ఆర్టీసీ కార్గోలో 'ఖలేజా' చోరీ: పోలీసుల పంజాకు ఘరానా దొంగ విలవిల!

-రూ. 5.8 లక్షల విలువైన 12 స్మార్ట్‌ఫోన్లు, ఎరువుల బాక్సులు స్వాహా
-సీసీ కెమెరా సాక్షిగా రికార్డు
సమయంలో నిందితుడి ఆటకట్టించిన ×ఎ టౌన్ ఖాకీలు
-కేసు నమోదైన 24 గంటల్లోనే
కటకటాల్లోకి బూడిదపాడు సుధాకర్

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీ పార్శిల్ సర్వీసుపై కన్నేసి, గుట్టుచప్పుడు కాకుండా విలువైన సొత్తును మాయం చేసిన ఘరానా దొంగ పోలీసుల వేటలో దొరికిపోయాడు. పక్కా రెక్కీ నిర్వహించి చేతివాటం ప్రదర్శించిన నిందితుడిని కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు మెరుపు వేగంతో అరెస్ట్ చేసి, ఊచలు లెక్కించేలా చేశారు.

అసలేం జరిగింది?

కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లోని ఏపీఎస్ఆర్టీసీ కార్గో పార్శిల్ సెంటర్‌లో ఆగస్టు 18, 19 తేదీల్లో భారీ చోరీ చోటుచేసుకుంది. 11 ఒప్పో (రాజూజూశీ), ఒక వివో ఎస్-2 (ఎఙజశీ ూ2) మోడల్ ఫోన్లు కలిగిన ఖరీదైన పార్శిల్ బాక్స్‌తో పాటు, మరో ఆర్గానిక్ ఫర్టిలైజర్స్ (సేంద్రీయ ఎరువుల) బాక్స్‌ను గుర్తుతెలియని వ్యక్తి చాకచక్యంగా తస్కరించాడు. పార్శిల్స్ మాయమైన విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కార్గో మేనేజర్ కే. మనోజ్ లబోదిబోమంటూ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై పోస శ్రీనివాసులు తక్షణమే కేసు నమోదు చేశారు.



సీఐ విక్రమ సింహ స్కెచ్... జల్లెడ పట్టిన బృందం:
కేసు తీవ్రతను గుర్తించిన సీఐ విక్రమ సింహ రంగంలోకి దిగి దర్యాప్తును పరుగులు పెట్టించారు. ఎస్సై పోస శ్రీనివాసులు సారథ్యంలో హెడ్ కానిస్టేబుల్ జీనస్, కానిస్టేబుళ్లు మురళి, సుబ్బరాయుడులతో కూడిన ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించారు. బస్టాండ్ ప్రాంగణంలోని మూలమూలలా అమర్చిన సీసీటీవీ ఫుటేజీలను అణువణువూ జల్లెడ పట్టారు. నిందితుడి కదలికలను సాంకేతికంగా విశ్లేషించి, నిక్కచ్చిగా ఆచూకీ కనిపెట్టారు. చోరీకి పాల్పడింది బూడిదపాడు గ్రామానికి చెందిన తలారి సుధాకర్ (40, తండ్రి: శ్రీరాములు)గా నిర్ధారించుకున్నారు.

24 గంటల్లోనే క్లైమాక్స్... సొత్తు రికవరీ:
కేసు రిజిస్టర్ అయిన కేవలం 24 గంటల గడువులోనే పోలీసులు పక్కా వ్యూహంతో నిందితుడిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన రూ. 5.8 లక్షల విలువైన 12 అత్యాధునిక స్మార్ట్‌ఫోన్లు, ఆర్గానిక్ ఫర్టిలైజర్ల బాక్స్‌ను నయాపైసా నష్టం లేకుండా పూర్తిస్థాయిలో రికవరీ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

నేరగాళ్లకు సీఐ మాస్ వార్నింగ్:
కేసును అత్యంత వేగంగా ఛేదించి, ప్రజా సొత్తును కాపాడిన ఎస్సై పోస శ్రీనివాసులు, సిబ్బంది మురళి, సుబ్బరాయుడు, జీనస్‌లను సీఐ విక్రమ సింహ మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ సందర్భంగా సీఐ స్పందిస్తూ... "చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజల, సంస్థల సొత్తును దోచుకోవాలని చూస్తే ఎంతటి వారైనా ఊచలు లెక్కించాల్సిందే. నేరం చేసిన వాడు పాతాళంలో దాక్కున్నా పట్టుకుని తీరతాం" అని ఘాటుగా హెచ్చరించారు.

## మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో తొలి ట్రస్ట్ బోర్డు సమావేశం - ఆరు అజెండాలపై చర్చ

పల్లెవెలుగు బేతంచెర్ల, సెప్టెంబర్ 15: శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి వారి దేవస్థానంలో



నూతన ధర్మకర్తల మండలి ప్రథమ సమావేశం సోమవారం వైభవంగా జరిగింది. డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి (ఈవో) గారి సమక్షంలో జరిగిన ఈ సమావేశం ప్రశాంత వాతావరణంలో సాగింది. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా మొత్తం 6 ముఖ్యమైన అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆలయానికి చెందిన 210 ఎకరాల భూముల సర్వే కోసం తహసీల్దార్ కు లేఖ.అమ్మవారి ఆలయం పక్కన కొండను 40 అడుగులు తొలగింపునకు కమిషనర్ కు లేఖ. గోరుకల్లు రిజర్వాయర్ నుండి త్రాగు, స్నానాల నీటి సౌకర్యం కోసం =బొ శాఖకు లేఖ. ఆలయ ముందు భాగంలో టేకు ద్వారాలకు వెండి తొడుగు ఏర్పాటుపై చర్చించారు. నూతన ఈవో కార్యాలయం, వైద్యుని గది, దర్శన మండపం నిర్మాణ అంచనాల తయారీ. అక్టోబర్ 11 నుండి 21 వరకు జరగనున్న దసరా మహోత్సవాల ఏర్పాట్లపై చర్చ స్వామివారి ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేస్తామని ఈవో గారు మరియు ధర్మకర్తలు తెలిపారు.

## హెచ్.కొట్టాల సమీపంలో రోడ్డు ప్రమాదం - వ్యక్తికి తీవ్ర గాయాలు



బేతంచెర్ల, పల్లెవెలుగు సెప్టెంబర్ 15: బేతంచెర్ల – డోన్ రహదారిపై హెచ్.కొట్టాల సమీపంలో గల ఫ్యాక్టరీ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.
ఆటోను బైక్ ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. డోన్ వైపు నుండి బైకుపై వస్తున్న వ్యక్తి అతివేగంతో వస్తూ ఆటోను ఢీకొనడంతో అదుపుతప్పి బోల్తా పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలవ్వడంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆటోలో ఆసుపత్రికి తరలించారు.

## గోడల ఆంజనేయ స్వామి నగర్‌లో వెల్లివిరిసిన భక్తిభావం

--- ఘనంగా వినాయక ఉత్సవాలు.. భక్తులకు ప్రత్యేక అల్పాహార వితరణ
--- విశేషంగా తరలివచ్చిన కాలనీవాసులు, మహిళలు

పల్లె వెలుగు, కర్నూలు బ్యూరో: కల్లూరు మండల పరిధిలోని శ్రీ గోడల ఆంజనేయ స్వామి



నగర్‌లో వినాయక చవితి నవరాత్రి వేడుకలు ఆధ్యాత్మిక ఉత్సాహంతో అంబరాన్నంటాయి. స్థానిక శ్రీ గోడల ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో భక్త బృందం ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుని ఉత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం లక్ష్మీదేవి ప్రథమ కుమారుడు నరసింహ పేరిట భక్తులకు భారీ ఎత్తున ప్రత్యేక అల్పాహార వితరణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.
ముందుగా గణపతికి, ఆంజనేయ స్వామివారికి వేదమంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు, దివ్య మంగళ హారతులు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అల్పాహార ప్రసాద వితరణలో కాలనీవాసులు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల భజనలు, జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో పులకించాయి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప??దైన ఏర్పాట్లు చేయడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.
ఈ సేవా కార్యక్రమంలో ప్రముఖులు శేఖర్ రెడ్డి, షేక్షావలి, నారాయణ, సుబ్బు, కాశమ్మ, ఆచారి, రవి, జలాల్, అన్వర్ బాషా తదితరులతో పాటు కాలనీవాసులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మద్యం షాపుల లైసెన్స్ రెన్యువల్ పై అవగాహన



పల్లెవెలుగు బేతంచెర్ల, సెప్టెంబర్ 15: నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.రవికుమార్ ఆదేశాల మేరకు బేతంచెర్ల మండలంలోని బ్రాందీ షాపుల లైసెన్స్ దారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లైసెన్స్ రెన్యువల్ ప్రక్రియ, ఫీజుల వివరాలను అధికారులు వివరించారు. బేతంచెర్ల పరిధిలో లైసెన్స్ ఫీజు రూ.60.50 లక్షలు, రెన్యువల్ ఫీజు రూ.23 లక్షలు, పర్మిట్ రూమ్ ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెస్ ఫీజు రూ.5 వేలు ఉంటుందని డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జఫరుల్లా, ఎస్సై సోమశేఖర్ లు తెలిపారు. లైసెన్స్ దారులు నిర్ణీత ప్రక్రియ ప్రకారం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లైసెన్స్ దారులు మోహన్ రెడ్డి, నాగరాజు, పాల శేఖర్, రూబీనా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై రూ.2 వేలు దాటితే యూపీఐపై ఎండీఆర్!

అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు..
వినియోగదారులకు కాదు.. వ్యాపారులపైనే భారం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపుల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. రూ.2,000కు మించిన లివ్యాపారి చెల్లింపులు (ు2వీ)లపై 0.40 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) విధించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ప్రీజ×) కొత్త నిబంధనలను ప్రకటించింది. ఈ ఛార్జీలు అక్టోబర్ 15, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే ఈ నిర్ణయంతో ప్రతి యూపీఐ లావాదేవీపై ఛార్జీ పడుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టమవుతోంది. వ్యక్తి నుంచి వ్యక్తికి (ు2ు) చేసే యూపీఐ బదిలీలు ఎప్పటిలాగే ఉచితమే. అలాగే వ్యాపారులకు రూ.2,000 వరకు చేసే చెల్లింపులపైనా వీణ= ఉండదు. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం దాదాపు 96 శాతం ు2వీ లావాదేవీలు ఈ మార్పు పరిధిలోకి రావు.

ఎంత చెల్లిస్తే.. ఎంత వీణ=?

రూ.2,000 దాటిన సాధారణ వ్యాపారి లావాదేవీలకు 0.40 శాతం వీణ= వర్తిస్తుంది. అంటే రూ.3,000 చెల్లింపుపై రూ.12, రూ.50,000పై రూ.200, రూ.75,000పై రూ.300 వరకు వీణ= ఉంటుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు గరిష్ఠ వీణ= రూ.300కే పరిమితం.
∩ గమనిక: రూ.2,000పై 0.40 శాతం అంటే రూ.8. కాబట్టి రూ.2,000కు రూ.4 ఛార్జీ అన్న లెక్క సరైంది కాదు.

కొన్ని రంగాలకు ఫ్లాట్ ఛార్జీ

రైల్వేలు, టెలికాం, బీమా, పెట్రోల్-డీజిల్ వంటి




ఎంపిక చేసిన విభాగాల్లో రూ.2,000 దాటిన ఒక్కో లావాదేవీకి రూ.5 ఫిక్స్డ్ వీణ= విధించనున్నారు. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్లు, డీలర్ల వంటి క్యాపిటల్ మార్కెట్ విభాగాలకు 0.02 శాతం వీణ= వర్తించనుంది.

చిన్న వ్యాపారులకు ఊరట

నెలకు ~ు= కోడ్ ద్వారా యూపీఐలో రూ.1 లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపారులకు వీణ= నుంచి మినహాయింపు కల్పించారు. దీంతో చిన్న దుకాణాలు, చిరు వ్యాపారులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది: ఈ వీణ= వ్యాపారి వైపు విధించే ఛార్జీ. సాధారణ వినియోగదారుడి బ్యాంకు ఖాతా నుంచి నేరుగా 0.40 శాతం కోత పడుతుందని అర్థం కాదు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com